సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఎంపికైన జిల్లా జట్లతో ఎంఈవో, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, జనవరి 7: మాసాయిపేట జడ్పీహెచ్ఎస్‌లో మంగళ వారం జిల్లా స్థాయి అండర్ –14 బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గంగాల రమేశ్ తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 70 మంది బాలబాలికలు పాల్గొనగా అందులోంచి 32 మందిని తుది జట్లకు ఎంపిక చేశారు. త్వరలోనే జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఎంపికైన జిల్లా జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లీలా వతి, హెచ్ఎం ధర్మపురి, పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు నాగరాజు, పీఈటీ శ్యాంసుందర్, కోచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు దుంపల సిరి

రోబోను ప్రదర్శిస్తున్న బాలిక దుంపల సిరి

వెల్దుర్తి, జనవరి 7: రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు మాసాయిపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని దుంపల సిరి ఎంపికైనట్లు హెచ్ఎం ధర్మపురి తెలిపారు. రైతులు ఇంటి వద్దనే ఉండి పొలాలకు సాగునీరు అందించే స్వయం చాలక నీటి పారుదల రోబో విధానాన్ని విద్యార్థిని సిరి తయారుచేసింది. దీంతో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేయిర్‌లో ప్రదర్శించనున్నది. ఈ నమూనా తయారీకి గైడ్ టీచర్ ఆంజనేయులు సహకారాన్ని అందించారు.

బాలికలకు సంక్రాంతి పురస్కారాలు

పురస్కారాలు అందుకుంటున్న బాలికలు

రామాయంపేట, జనవరి 7: రామాయపేటకు చెందిన ముగ్గురు బాలికలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సినీ నటుడు బాబుమోహన్, టీవీ నటి రాగిని సంక్రాంతి పురస్కారాలను మంగళవారం అందజేశారు. మణికంఠ డ్యాన్సు ఇన్‌స్టిట్యూట్‌లో కూచిపూడి, భరత నాట్యంలో శిక్షణ తీసుకున్న ముగ్గురు బాలికలు తుజాల లితిక్ష, మనస్విని, వైష్ణవి రవీంద్రభారతిలో జరిగిన కూచిపూడి, భరత నాట్యంలో ప్రతిభ చాటారు.

హిందీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 7: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. హిందీ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు అందించాలన్నారు. ఈనెల 16వ తేదిన నిర్వహించే డెమో క్లాస్‌కు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నర్సాపూర్, జనవరి 7: మండలంలోని జక్కపల్లి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌లో 2025–26 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఫర్హానా ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ సీట్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోడానికి చివరి తేది ఫిబ్రవరి 28గా నిర్ణయించినట్లు తెలిపారు. పరీక్ష తేదీ ఏప్రిల్ 13న కలదని, పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ వారికి రూ.125, ఓసీలకు రూ.200 నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నేడు ఆయిల్‌పాం సాగుపై అవగాహన

చిన్నశంకరంపేట, జనవరి 7: ఈనెల 8న చిన్నశంకరంపేటలోని రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అగ్రికల్చర్ మండల ఫీల్డ్ ఆఫీసర్ సుజాత ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీహెచ్ఎస్‌వో ప్రతాప్‌సింగ్, ఆయిల్‌పాం కంపెనీ టెక్నికల్ సలహాదారు డాక్టర్ రంగనాయకులు, ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్ హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

శివ్వంపేట, జనవరి 7: డిమాండ్ ఉన్న ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ లావణ్య అన్నారు. మంగళవారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో సాగుచేస్తున్న ఓ రైతు పొలంలో అయిల్‌పాం మొక్కలను ఏవో లావణ్య నాటారు. 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, టన్నుకు రూ. 21వేల ధర పలుకుతుందన్నారు. రైతులు సాంప్రదాయ పంటలను మానేసి పామాయిల్ వంటి పంటలు సాగుచేస్తే మంచిదని అన్నారు. ఆమె వెంట ఏఈవో భువనేశ్వరి, పామాయిల్ కంపెనీ ప్రతినిధి అజయ్ తదితరులు ఉన్నారు.

ఎంబీఏ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

కౌడిపల్లి, జనవరి 7: హైదరాబాద్ బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ కళాశాలకు చెందిన 68 మంది విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండలంలోని సదాశివపల్లి గ్రామాన్ని సందర్శించారు.కళాశాలకు చెందిన ప్యాకల్టీలు డీఎన్ రవినాథ్, మహమ్మద్ హుస్సేన్, మిస్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి రైతులతో కలిసి వరి నారు మడులు పరిశీలించి నాట్లు వేశారు. డాక్టర్ రామానాయుడు గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థకు చెందిన ఫీల్డ్ కోఆర్డినేటర్ జగదీశ్ పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్లతో ఎంఈవో, ఉపాధ్యాయులు

రహదారి భద్రత సమిష్టి బాధ్యత

మెదక్ మున్సిపాలిటీ: మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ రూరల్: అవగాహన కల్పిస్తున్న ఎస్సై మురళి

పెద్దశంకరంపేటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు.

ప్రమాదాలు నివారణకు కృషి: ఎస్పీ

రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీస్ యంత్రాగం కృషి చేస్తుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేషనల్ హైవే, ఆర్ అండ్‌బీ, పోలీస్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలను రోడ్డు ప్రమాదాల బారినపడకుండా పరిరక్షిస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీరామ్, డీటీవో వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, పీఆర్, ట్రాన్స్‌కో, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై రంగోలీ పోటీలు

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత నియమాలు, చిహ్నాలు అనే అంశంపై విద్యార్థులకు రంగోళి పోటీలు నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మెదక్‌రూరల్, జనవరి7: భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని మెదక్‌రూరల్ ఎస్సై మురళి అన్నారు. మంగళవారం జాతీయ రోడ్ల భద్రతా వారోత్సవాలను పుస్కరించుకుని మండలంలోని మంబోజిపల్లిలో పోలీసులు వాహనదారులకు ,ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై శివకుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి, జనవరి 7: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రత, నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబయ్య తెలిపారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించగా, అందులో ట్రాఫిక్ సిగ్నల్, నిబంధనలపై పలు రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

పెద్దశంకరంపేట, జనవరి 7: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. రహదారి నిబంధనలు పాటించాలని కోరుతూ విద్యార్థినులు వివిధ రకాల ఆకృతులతో ముగ్గులు వేశారు. ఎంఈవో వెంకటేశం పరిశీలించారు.

పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలి

చార్ట్ ద్వారా అవగాహన శిశు సంక్షేమ అధికారిహేమవతి

పాపన్నపేటలో సీమంతాలు చేస్తున్న అంగన్వాడీ టీచర్

జిల్లా శిశు సంక్షేమ అధికారి హేమవతి

మెదక్ రూరల్, జనవరి 7: అంగన్‌వాడీ ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహరన్ని అందించి పౌష్టికాహార లోపాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హేమవతి సూచించారు. మంగళవారం మండలంలోని పాతూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహర నిల్వలు, రిజిస్టర్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. ప్రీ స్కూల్‌లో కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనేది పర్యవేక్షించి టీచర్‌కు పలు సూచనలు చేశారు. గర్భిణులు ,బాలింతలకు పౌష్టికహారం గురించి చార్ట్ ద్వారా అవగాహన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రోజులో ఒక పూట పోషకాలతో నిండిన సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. సంతులిత ఆహారం తీసుకోవాలన్ని సూచించారు .

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శ్రీమంతాలు

పాపన్నపేట, జనవరి 7: పాపన్నపేట మండలంలోని చిత్రియల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు, పుట్టిన రోజు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అప్సరిబేగం, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించిన ఎస్పీ

భరోసా కేంద్రంలో కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 7: స్థానిక భరోసా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మెదక్ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ హాల్ ద్వారా బాధితులు కోర్టుకు రాకుండా తమ వాంగ్మూలాన్ని నేరుగా భరోసా సెంటర్ నుంచి కోర్టుకు నివేదించవచ్చన్నారు. ఇక నుంచి పోక్సో కేసు బాధితులు అందరూ ఇక్కడి నుంచే తమ సాక్ష్యాలను కోర్టుకు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ మధుసూదన్ గౌడ్ పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

అతిథులకు మెమెంటో అందజేస్తున్న యాజమాన్యం

నర్సాపూర్, జనవరి 7: ఫార్మాసిస్టులు పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మిర్జా నజీమ్ బేగ్ సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని వైపర్ కళాశాలలో ఎల్ఎస్ఎస్ ఎస్‌డీసీ, పీసీఐ వారు కలిసి నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం 7 నుంచి 10వ తేదీ వరకు ఉంటుందని కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ బైలా కో చైర్మన్ ఆఫ్ డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమేశ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

రామాయంపేట బంద్ ప్రశాంతం

పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భూబాధితులు

రామాయంపేట, జనవరి 6: రా మాయంపేట నుంచి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట –ఎల్కతుర్తి హైవే రోడ్డు పనులు చేపట్టాలని, బైపాస్ రోడ్డు వద్దని వ్యాపారస్తులు, పట్టణవాసులు పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట బంద్ నిర్వహించారు. రోడ్డు పనులను ఆ పేయించారు. ఏడాది కాలంగా తమకు బైపాస్ వద్దు పట్టణంలో నుంచే రోడ్డు వెళ్లాలని మొత్తుకున్నా అధికార వర్గాలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్‌తో తమ విలువైన భూములు, వ్యా పారాలు దెబ్బతింటాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తమ నిర్ణయాలను మార్చుకుని న్యాయం చేయాలని కోరారు.

స్వచ్ఛందంగా బంద్ నిర్వహించిన వ్యాపార వాణిజ్య సంస్థలు

సోమక్కపేట సొసైటీలో ఎరువుల కొరత

మూసీ ఉన్న ఆగ్రో రైతు సేవా కేంద్రం

ఎరువులు లేక మూసి ఉన్న సోమక్కపేట సొసైటీ

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలిపిచెడ్, జనవరి 7: యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, చండూర్, చిలిపిచెడ్,చిట్కుల్ గ్రామాలకు అనుకుని మంజీరా నది ప్రవహిస్తున్నది. దీంతో రైతులు వరిని ఎక్కువగా సాగు చేస్తారు. వరి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్న రైతులకు ఎరువులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 19 గ్రామాలకు ఒకే సొసైటీ సోమక్కపేటలో ఉన్నది. ఈ సమయంలో సొసైటీ, రైతు ఆగ్రో సేవా కేంద్రంలో కూడా లేకపోవడంతో పక్క మండలాల్లో, సంగారెడ్డి జిల్లా జోగిపేట నుంచి ఎక్కువగా ధరకు కొనాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత ఉండేదికాదని, సకాలంలో అందేవని కొంతమంది రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పంటికైనా వ్యవసాయాధికారు లు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

సుతిలీ బాంబులతో ఇంటిపై దాడి

- భయభ్రాంతులకు గురైన ఇంటివాసులు
- పాక్షికంగా పెంకుటిల్లు ధ్వంసం

రాజమణి

ధ్వంసమైన ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఎస్సై

రామాయంపేట, జనవరి 7: గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి సుతిలీ బాంబులతో ఓ ఇంటిపై దాడి చేసిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిమింటి రాజమణి రాత్రి తమ కుటుంబంతో నిద్ర పోయింది. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు బాంబులతో ఆమె ఇంటిపై దాడికి దిగారు. ఆ ఇంటి చుట్టూరా ఉన్న మరో పది ఇండ్ల బయట గడియలు వేసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు . సుతిలీ బాంబులతో దాడి చేయడంతో పెంకుటిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నది. బయట గడియ వేయడంతో ఎవరూ ఇండ్లలో నుంచి బయటకు రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తెల్లవారుజామునే ఎస్సై బాలరాజు తమ సిబ్బందితో లక్ష్మాపూర్‌కు చేరుకున్నారు. బాధితురాలి ఇంటిని పరిశీలించారు. అవి దీపావళికి కాల్చే సుతిలీ బాంబులని తేల్చారు. దుండగులను త్వరలోనే గుర్తిస్తామని, ఆందోళన చెందవద్దని తెలిపారు. రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

పాఠశాలకు పట్లోరి ఫౌండేషన్ విరాళం

కౌడిపల్లి, జనవరి 7: పుట్టిన ఊరును, చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా సేవ చేయడం గొప్ప విషయమని ఎంపీ రఘునందన్‌రావ్ అన్నారు. మంగళవారం మండలంలోని కంచనపల్లి ఉన్నత పాఠశాలకు అదేగ్రామానికి చెందిన పట్లోరి ఫౌండేషన్ (ఎన్ఆర్ఐ) ఆధ్వర్యంలో రూ.60 లక్షల వ్యయంతో ప్రహరీ, 2 అదనపు గదులు, మూత్రశాలల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో బాల్‌రాజ్, విద్యాశాఖ అధికారులు, ఫౌండేషన్ సభ్యులు తిరుమల్‌రావు, నిమ్మాద్రి రావ్ పాల్గొన్నారు.

108 వాహనాన్ని ప్రారంభించిన ఎంపీ

మనోహరాబాద్, జనవరి 7: మనోహరాబాద్‌లోని పీహెచ్‌సీకి మంజూరైన 108 వాహనాన్ని ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. మనోహరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన యువకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నత్తి మల్లేశ్ ముదిరాజ్, బీజేపీ నాయకుడు అజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నిజాంపేట, జనవరి 7: రాంపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు మెడికల్ ఆఫీసర్లు సంతోషి, సిద్ధిరాములు తెలిపారు. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు ఈ పరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, నరేశ్, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్లా, ఏఎన్ఎం జయంతి పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ రాష్ట్ర ఉత్తమ అవార్డుకు రాజ్‌పల్లి పాఠశాల ఎంపిక

మెదక్‌రూరల్, జనవరి 7: మండలంలోని రాజ్‌పల్లి జడ్పీహెచ్ఎస్ రాష్ట్ర స్థాయిలో ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపికైనందని. హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ ప్రీతీ, హెచ్ఎం శ్రీనివాస్, మెదక్ ఎంఈవో నీలకంఠంకు అందజేశారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను కలిసిన మాల మహానాడు నాయకులు

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

కౌడిపల్లి, జనవరి 7: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాలపై రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి సంజీవ, సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివ మంగళవారం కలిశారు. మండల, జిల్లానాయకులతో కలిసి సమస్యలను ఆయనకు వివరించారు. నర్సాపూర్ మండల అధ్యక్షుడు గోవు యాదగిరి, కౌడిపల్లి మండల అధ్యక్షుడు నీరుడి కుమార్, కృష్ణ, ఈశ్వరయ్య, గోపాల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు కుత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు

లింబాద్రి, వైద్యుడు

రామాయంపేట, జనవరి 7: దేశవ్యాప్తంగా చైనా హెచ్ఎంపీవీ వైరస్ కేసులు వేల సంఖ్యలో నమోదవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రామాయంపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం దవాఖానలో విలేకరులతో మాట్లాడుతూ దగ్గు, జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులు, కళ్లు తిరుగడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎక్కడికైనా వెళ్లాలంటే మాస్కు ధరించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

శివ్వంపేట, జనవరి 7: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చండి గ్రామ శివారులో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ ఉన్న గుర్తు తెలియని మహిళ (45) మంగళవారం నర్సాపూర్–తూప్రాన్ ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాలపాలైన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై చండి గ్రామ పంచాయతీ కార్యదర్శి బర్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. 7ఎస్‌పిటి02ఎ : మృతిచెందిన గుర్తుతెలియని మహిళ

విద్యుదాఘాతంతో బర్రె మృతి

చిలిపిచెడ్, జనవరి 7: విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందిన ఘటన మండలంలోని చిట్కుల్ గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లెగారి బాలమణి కూలీ పనులు చేసుకుంటూ పాడి పోషణతో జీవనం కొనసాగిస్తున్నది. ఆమె ఎప్పటిలాగే తన బర్రెలను మేతకు శివారు ప్రాంతానికి తీసుకెళ్లింది. అక్కడ మేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తెగి బర్రెను తాకాయి. దీంతో అక్కడికక్కడే చనిపోయింది. వెంటనే విద్యుత్ లైన్‌మెన్ కృష్ణ, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి చూసి వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం విద్యుత్ ఏడీ, డీఈలతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 7: లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయలైన ఘటన మండలంలోని కొర్విపల్లి గ్రామశివారులోని చేగుంట మెదక్ ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. మెదక్ నుంచి మాసాయిపేటకు కోళ్ల దాణ లోడుతో వెళ్తున్న లారీ కొర్విపల్లి గ్రామ శివారులోకి రాగానే అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వాహనదారులు బయటకు తీసి, చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించారు. విషయాన్ని తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. ట్రాఫిక్ జాము కాకుండా తదుపరి చర్యలను పోలీసులు తీసుకున్నారు.

సమ్మె నోటీసు అందజేత

చిన్నశంకరంపేట, జనవరి 7: ఈనెల 10వ తేదీ నుంచి విధులకు వెళ్లబోమని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ఎంపీవో గిరిజారాణికి సమ్మె నోటీసులు అందించారు. ఐదు నెలలుగా తమకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాక పండుగలు చేసుకోలేని దుస్థితి నెలకొందన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు విధులకు హాజరు కాబోమన్నారు. మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సబ్బులు పంపిణీ

నర్సాపూర్, జనవరి 7: బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో కార్వెడ్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు డెటాల్ సబ్బులను మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం రాంబాబు, కార్వెడ్ సంస్థ ఆర్గనైజర్ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరికి తీవ్రగాయాలు

రామాయంపేట, జనవరి 7: రైలు కింద పడి ఓ వ్యక్తి చేయి కోల్పోయి, గాయాల పాలైన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. రైల్వే అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన కృష్ణ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో రైలు ఎక్కి అక్కన్నపేటకు టికెట్ తీసుకున్నాడు. మద్యం మత్తులో ఉన్న క్షతగాత్రుడు అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు ఒక స్టేజి ముందే మిర్జాపల్లిలో రైలు దిగబోయి ప్రమాదవశాత్తు రైలు కింద పట్టాలపై పడ్డాడు. రైలు వెళ్లాక చూస్తే అప్పటికే క్షతగాత్రుడి చేతి విరిగిపోయి, తలకు, భుజాలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నార్సింగి 108 అంబులెన్సు సిబ్బంది తిరుపతి, శ్రీకాంత్ రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రామాయంపేట, జనవరి 7: పర్వతాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల పెంటయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుడి కుటుంబానికి రూ.28వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ సర్పంచ్ కామిని రవీందర్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తౌర్యా నాయక్, సురేందర్, లక్ష్మీపతి, స్వామి, యాదగిరి, లక్ష్మణ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

నిజాంపేటలో

నిజాంపేట, జనవరి 7: మండలంలోని శౌకత్‌పల్లి తండాకు చెందిన మాడవత్ జంలికి రూ.40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.